పంటలపై అడవి పందుల బీభత్సం


చందోలి శివారులో అడవి పందులు నష్టపరిచిన ఓ రైతు పంట


పంటను కాపాడేందుకు రక్షణగా చీరలు

- మొక్కజొన్న పంటకు రక్షణ కల్పించని అధికారులు
- భారీగా నష్టపోతున్న రైతులు
- పరిహారమిప్పించాలని వేడుకోలు

గొల్లపల్లి: మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేస్తూ రైతుకు పుట్టెడు కష్టం మిగులుస్తున్నాయి. వాటిని కట్టడి చేసేందుకు ప్రయత్నించిన రైతులపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు పంట రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి.

రోజురోజుకు పెరుగుతున్న ఆగడాలు

చందోలి, వెన్గుమట్ల, భీంరాజ్‌పల్లి, ఆత్మకూర్, చిల్వాకోడూర్, గోవిందుపల్లి, రాఘవపట్నం, లక్ష్మీపూర్, తిర్మలాపూర్, అగ్గిమల్ల, గుంజపడుగు, గొల్లపల్లి, రాపల్లి గ్రామాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పండిస్తారు. మొక్కజొన్న కంకులు వచ్చే సమయంలో రాత్రి పందులు మూకుమ్మడిగా దాడులు చేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. రైతులు పంట చుట్టూ తీగలు, వివిధ రకాల రంగుల చీరలు కడుతున్నారు. అయినా వాటి ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే చందోళి గ్రామానికి చెందిన రాజయ్య, సత్యం, బొంకూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్, భీంరాజ్‌పల్లికి చెందిన ఓ రైతు చేన్లో డ్రిప్‌తో సహా పంటను ధ్వంసం చేశాయి. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడితో సహా నష్టపోయారు. ఇప్పటికైనా ఫారెస్ట్, వ్యవసాయాధికారులు అడవి పందుల దాడుల నుంచి పంటలను రక్షించాలని మొర పెట్టుకుంటున్నారు.

పంట నష్టం చెల్లించాలి



పంటను కాపాడుకోవడం కష్టతరంగా ఉంది. అడవి పందులు గుంపులుగుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవలే మా ఊళ్లో రైతుల పంటపై దాడి చేసి తీవ్రంగా నష్టం చేశాయి. అధికారులు పందుల బారి నుంచి రక్షించి పంట నష్టాన్ని చెల్లించాలి.

– గోళ్ల నర్సయ్య, రైతు, చందోళి

పందుల నుంచి రక్షించాలి



పంట చేతికొచ్చే తరుణంలో అడవి పందులు దాడులు చేస్తున్నాయి. అధికారులు వీటి బారి నుంచి పంటను రక్షించాలి. కంటికి నిద్ర లేకుండా పొలంలోనే మంచం వేసుకొని డబ్బ చప్పుళ్లతో, డీజే సప్పుడు చేసి వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించినా పోవడం లేదు. రాత్రివేళలో గుంపులుగుంపులుగా వచ్చి పంటలను నష్టపరుస్తున్నాయి.

– అలిశెట్టి రవీందర్, చందోలి మాజీ సర్పంచ్

రైతులే రక్షించుకోవాలి



అడవి పందులు, కోతుల బెడద ఉంది. గతంలో ప్రభుత్వమే సోలార్ ఫెన్సింగ్ లాంటివి సబ్సిడీపై ఇచ్చింది. ప్రస్తుతం అలాంటి సౌకర్యం లేదు. రైతులకు పంట నష్టం మాత్రమే ఇవ్వగలం. ఎవరు వేసిన పంటలను వారే రక్షించుకోవాలి.

– కరుణ, ఏవో

క్రిమినల్ కేసులపై అవగాహన

వెల్గటూర్: స్తంభంపల్లి జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హరీశ్, ఎస్సై ఉమాసాగర్ క్రిమినల్ కేసులపై అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాలలో 9, 10 తరగతులు చదివే ముగ్గురు విద్యార్థులు కలిసి 8వతరగతి చదువుతున్న తోటి విద్యార్థిపై తలలో రక్తం గడ్డకట్టేలా దాడి చేసి, మర్మాంగాలు వాచిపోయేలా భౌతిక దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. నెల రోజుల క్రితం కూడా ఇద్దరు విద్యార్థులు తోటి విద్యార్థిపై దాడి చేయగా.. విద్యార్థి పాఠశాల నుంచి పారిపోయాడు. ఈక్రమంలో విద్యార్థులు క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటే ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జక్కని రాజేశం పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హరీశ్

చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీ


వాహనం తనిఖీ చేస్తున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్: ఎన్నికల కోడ్ దృష్ట్యా అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం ఒబులాపూర్‌లో బాదనకుర్తి వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈసీ మార్గదర్శకాల అమలులో పోలీసుల పాత్రే కీలకమన్నారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రాజు, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు


బహుమతి అందజేస్తున్న సంజయ్‌కుమార్

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం అల్లీపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు ముగిశాయి. విన్నర్‌గా ముఖీద్ ఛాంలెజర్స్, రన్నర్‌గా మురళి జట్లు నిలిచాయి. వీరికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు ముఖీద్, ఉప సర్పంచ్ సాగర్‌రావు, నాయకుడు రత్నాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, గోపి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు మారుతి, రెహ్మతుల్లా, విఘ్నేశ్, నిక్షిత్, సాత్విక్ ఈనెల 13న బీమారం మండలం జెడ్పీహెచ్‌ఎస్ గోవిందారంలో నిర్వహించిన సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు నల్గొండ జిల్లా ఆలేరులో ఈనెల 22, 23, 24 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను డాక్టర్ అజిత్, రజితరావు అభినందించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

రాయికల్: ధర్మాజీపేట గ్రామానికి చెందిన కుంబం ఆదిరెడ్డి అనే యాదవ రైతుకు చెందిన మేక గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. లైన్‌మెన్ రమణచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. రూ.20వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

నూతన కమిటీపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

రాయికల్: మండలంలో నూతనంగా ఏర్పడిన గౌడ సంఘంపై ఆరోపణలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమని మండల అధ్యక్షుడు ఉత్కం సాయగౌడ్ అన్నారు. గురువారం రాయికల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని కుల సంఘాల నాయకుల మద్దతు, మెజార్టీ ఉండటంతోనే జిల్లా అధ్యక్షుడి సమక్షంలో గౌడ సంఘం కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకులు కొత్తకొండ లింగంగౌడ్, నాగుల మల్లయ్యగౌడ్, బొంగోని భూమగౌడ్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రాయికల్: అల్లీపూర్, శ్రీరాంనగర్ గ్రామాల్లోని పశువులకు గురువారం గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు అదనపు పశు వైద్యాధికారి డాక్టర్ నరేశ్ తెలిపారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతు సంఘ నాయకులు రమేశ్, చంద్రగౌడ్, మల్లేశ్, రాయలింగు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన


పోతారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్, బీఎల్వోలు

కథలాపూర్: కలిగోట, ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఎంపీడీవో శంకర్ గురువారం పరిశీలించారు. నీటి వసతి, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేశ్‌బాబు, స్టేట్ కన్వీనర్ చిర్ర ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పేద యువతి పెళ్లికి చేయూత

జగిత్యాలటౌన్: పేదింటి యువతి పెళ్లికి అండగా నిలిచిన సత్యసాయి సేవాసమితి సభ్యులు తమ సేవాతత్పరతను చాటుకున్నారు. సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పాంపర్తి జ్యోతి కూతురు చందన వివాహం నిశ్చయం కాగా.. ఎలాంటి ఆధారం లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబ పరిస్థితిని ఆ గ్రామ మాజీ సర్పంచ్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్‌కు తెలిపారు. భక్తుల సహాయంతో వివాహానికి కావాల్సిన పెళ్లి చీర, మంగళహారతి సెట్, కన్యదాన తాంబూలం, 25కిలోల బియ్యం, పప్పులతోపాటు పెళ్లి సామగ్రిని గురువారం అందజేశారు. చిటుమల్ల లక్ష్మీనారాయణ, వంగళ లక్ష్మీనారాయణ, పిప్పరి ఆంజనేయులు, జయశ్రీ, శ్రీలత, చంద్రకళ, లక్ష్మితోపాటు లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ పాంపర్తి లక్ష్మి పాల్గొన్నారు.

నృసింహుడి ఆలయంలో భక్తుల తోపులాట


కల్యాణం అనంతరం వేదిక వద్ద తోసుకుంటున్న భక్తులు

గొల్లపల్లి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరావడం.. ఆలయ ప్రాంగణం సరిపోకపోవడంతో స్వామివార్లను దర్శించుకునేందుకు నానాతంటాలు పడ్డారు. అనేక మంది చోటామోటా నాయకులు కల్యాణ వేదికపైకి వెళ్లేందుకు ఉత్సాహం చూపడంతో గందరగోళం నెలకొంది. ఎవరు ఎటువైపు నుంచి దర్శనానికి వస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆలయ, పోలీసు అధికారుల మధ్య సమన్వయలోపంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని పలువురు భక్తులు చర్చించుకున్నారు.

ఆధ్యాత్మికం

బోనమెత్తిన రామన్నపేట

మల్యాల: రామన్నపేట గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని కులాల ప్రజలు పోచమ్మ బోనాల్లో పాల్గొన్నారు. ఇంటికో బోనంతో మహిళలు బయలుదేరి, డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. బోనాలతో నైవైద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



వేదపండితుడికి తులాభారం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వేదపండితుడిగా పని చేస్తున్న బొజ్జ రమేశ్ ఆరోగ్యం బాగా లేదని తెలుసుకున్న అందాపూర్ వాస్తవ్యులు అరుణ, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి భక్త బృందం తులాభారం వేశారు.

మల్లికార్జునస్వామి జాతర ఆదాయం రూ.1.56లక్షలు

సారంగాపూర్: అర్పపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీమల్లికార్జునస్వామి జాతర ఆదాయం రూ.1,56,594 సమకూరింది. ఐదు రోజులపాటు జరిగిన జాతర ఉత్సవాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కట్నాల ద్వారా రూ.1,22,924, హుండీ ద్వారా రూ.33,670 సమకూరినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

ముస్తాబు..

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముస్తాబయింది.

సాయి ఆలయంలో బల్దియా చైర్మన్ పూజలు



జగిత్యాలటౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులోని శ్రీషిర్డిసాయిబాబాను బల్దియా చైర్మన్ దంపతులు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బల్దియా చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం తొలిసారి సాయిబాబాను దర్శించుకున్న అడువాల జ్యోతిలక్ష్మణ్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు పూలమాలతో ఘనంగా సన్మానించారు.

అన్నదానం గొప్పది

ధర్మపురి: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక ఓల్డు టీటీడీ కల్యాణ మండపంలో భక్తుల సౌకర్యార్థం గురువారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై ప్రారంభోత్సవం చేశారు. 13 రోజులపాటు ఉచిత అన్నదానం చేపడతామన్నారు. అడ్లూరి రూ.10వేలు విరాళంగా అందజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



ధర్మపురి: నక్కలపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా దేవాలయంలో పట్నాలు వేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో గురువారం వేంకటేశ్వరుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకుడు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పల్లకి సేవ నిర్వహించారు. గంద్ర వెంకటరావు–ప్రమీల దంపతులు అన్నదానం చేశారు.



విద్య, ఉపాధి విజయానికి సోపానాలు

కొండగట్టు(చొప్పదండి): మండల కేంద్రంలో కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురువారం ఆరో రోజుకు చేరుకుంది. కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాంతీయ అటవీ అధికారి కార్యాలయాల పరిసరాల్లోని చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ.. విద్య, ఉపాధి విజయానికి సోపానాలని సూచించారు. కళాశాల ప్రోగ్రాం అధికారులు ఆర్.గోపికృష్ణ, కె.సతీష్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


కొడిమ్యాల ఆరోగ్య కేంద్ర పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాలరూరల్: ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం తాటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బొలిశెట్టి గంగాధర్‌తోపాటు 50 మంది యువకులు, మహిళలు తాటిపల్లిలో కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీల అమలుతో నిరుపేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. బ్లాక్ అధ్యక్షుడు నందన్న, మండల అధ్యక్షుడు రాజేందర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సురేందర్, ఎంపీటీసీ భూంరెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, యూత్ నాయకులు మల్లేశ్, నవీన్ పాల్గొన్నారు.

సారంగాపూర్: కాంగ్రెస్ 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు చేరడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం బీర్‌పూర్, సారంగాపూర్ మండలాలకు చెందిన మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీఎత్తున బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గుడిసె జితేందర్, కోండ్ర రాంచంద్రారెడ్డి, ఆకుల రాజిరెడ్డి, మాలెపు సుధాకర్, రామడుగు రవి, బేతి పూర్ణచందర్‌రెడ్డి తదితరులున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారుల నిర్లక్ష్యంతోనే రైతుల పొలాలు ఎండుతున్నాయని ఎమ్మెల్సీ అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ డీ–53, 1ఆర్ కాలువను పరిశీలించారు. 1ఆర్ కాలువ తూముకు ఉన్న గేటును కొంతమంది రైతులు తొలగించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకున్నారని, గేటు తొలగించడంతో నీరు ఒకవైపుకు వెళ్లడంతో మరోవైపు పంటలు ఎండిపోయాయని డీఈ చక్రూనాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరువుల అమ్మకాల్లో బయోమెట్రిక్ తప్పనిసరి

సారంగాపూర్: ఎరువులను బయోమెట్రిక్ ద్వారా విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి అన్నారు. మండలంలోని అర్పపల్లితోపాటు, గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల వివరాలను ఈ–పాస్‌లో నమోదు చేయాలన్నారు. రశీదులు ఇవ్వాలని పేర్కొన్నారు . పలు దుకాణాదారులు వివరాలు చూపకపోవడంతో నోటీసులు జారీ చేశారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్ ఉన్నారు.

జియోట్యాగింగ్ చేయాలని కేంద్రం ఆదేశం

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేటు వృద్ధాశ్రమాలకు జియో ట్యాగింగ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు రాష్ట్ర వయోవృద్ధుల శాఖ తగిన చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ శాఖ జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్ అన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా శ్యామల

మల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా అల్లాడి శ్యామలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిఈశ్వరి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, ఇందిర, రజిత, వకుల, సఫియా, శ్రీదేవి, స్వరూపరాణి, శ్రీలత, లక్ష్మి, జమున, శారద, శోభ, రాజమ్మ, స్నేహ, పద్మ, రాధ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పెగడపల్లి: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర సూచించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం, పౌష్టికాహారం పంపిణీ చేసి రక్తహీనత పరీక్షలు నిర్వహించారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

రాయికల్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని జగిత్యాల ఎఫ్ఆర్వో ప్రణీత్‌కౌర్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గురువారం అల్లీపూర్‌లో అవగాహన కల్పించారు. అడవులు పెరిగితేనే వర్షాలు కురుస్తాయని, తద్వారా పంటలు పండుతాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ ఆఫీసర్లు రవికుమార్, అరుణ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్లు నరేశ్, హమీద్ పాల్గొన్నారు.

పచ్చదనం అందరి బాధ్యత

జగిత్యాల: పచ్చదనం అందరి బాధ్యతని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం ఎస్‌బీఐ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో కళాశాలకు 70 మొక్కలు అందజేశారు. ఎస్‌బీఐ వారు పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా కళాశాలలో మొక్కలు నాటడం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, రాధాకృష్ణ, పద్మాకర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

జగిత్యాలటౌన్: జిల్లాలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించడంతోపాటు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కౌలు రైతులకు రైతుబంధు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అలిశెట్టి ఈశ్వరయ్య, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, రాపర్తి రవి, దుమాల గంగారాం, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

జగిత్యాల: రక్తదానం ప్రతి ఒక్కరూ చేయాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హెల్త్ క్లబ్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు జ్యోతిలక్ష్మి, కిరణ్మయి, చంద్రయ్య, సత్యప్రకాశ్, జమున, పడాల తిరుపతి పాల్గొన్నారు.

రక్తదానం..

జగిత్యాలటౌన్: రక్తదానం చేస్తూ సీనియర్ పాత్రికేయుడు గుర్రం చంద్రశేఖర్ ప్రాణదాతగా నిలుస్తున్నారు. గురువారం బీర్పూర్‌కు చెందిన దండ్ల వెంకటమ్మకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా.. ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుల సమాచారం మేరకు రక్తదానం చేసిన చంద్రశేఖర్ వెంకటమ్మ ప్రాణాలు కాపాడారు.

జనావాసాల మధ్య బీడీ బట్టీలు తగదు

కోరుట్ల: పట్టణంలో జనావాసాల మధ్య బీడీ బట్టీ కంపెనీలు నిర్వహించటం తగదని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న బీడీ బట్టీ కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి నోటీసులు అందించారు. గజానంద్, ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: డ్రైనేజీ, సీసీ రోడ్లు సమస్యలను పరిష్కరించాలని 6, 25 వార్డులకు చెందిన ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. ఎల్‌ఎల్‌గార్డెన్స్ వెనుక డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, దుర్వాసన వస్తోందని, దోమలు వస్తున్నాయని, అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. 6వ వార్డులో గౌతమ స్కూల్ ఎదురుగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు.

బీసీల బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్: బీసీలను ఐక్యం చేసి బలోపేతానికి కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకొని మండల అధ్యక్షుడు సిరిపురం రాజేశ్‌తో కలిసి నియామక పత్రాలను అందజేశారు.